# అమ్మ

డాక్టర్ రావుగారి మైండ్ క్లినిక్ మెట్లెక్కుతున్నప్పుడు కూడా మనసులో అలజడి... తిరిగి వెనక్కెళ్ళిపోదామన్న ఆలోచన గొంతుని ఎన్నిసార్లు నులిమేశానో... హిమాయత్‌నగర్ మెయిన్‌రోడ్డులో మొదటి అంతస్థులో రావుగారి హాస్పిటల్ ఉంది. నేను వెళ్ళేప్పటికే దాదాపు పాతిక మంది వరకూ తమ వంతు కోసం ఎదురు చూస్తున్నారు.

"మీ పేరూ చిరునామా చెప్పండి" తన ముందున్న రిజిస్టర్ తెరిచి, రాయడానికి ఉపక్రమిస్తూ అడిగింది రిసెప్షనిస్ట్.

"నేను పేషంట్‌ని కాదు. డాక్టర్ గార్ని కలవడానికొచ్చాను" అన్నాను ఇబ్బందిగా కదుల్తూ.

ఆ అమ్మాయికి ఇరవైకి మించి వయసుండదు. రిజిస్టర్ మూసేసి నా వైపు ప్రశ్నార్థకంగా చూసింది. "మీరు డాక్టర్ గారికి తెలిసిన వాళ్ళా? మీకు అప్పాయింట్‌మెంట్ ఉందా" అని అడిగింది.

"లేదు"

ఆమె అందమైన మొహంలో చిరాకు కన్పించింది. "మీరొచ్చిన పనేమిటో చెప్పండి" అంది.

"రిసెప్షనిస్ట్ ఉద్యోగానికి ఇంటర్వ్యూ ఉందని పేపర్లో యాడ్ ఇచ్చారుగా. అందుకు..." కొద్దిగా సిగ్గుపడుతూ చివరి మాటలు మింగేశాను.

ఆమె నా వైపు మొదట వింతగా చూసింది. నన్ను అమాయకురాలనుకుందో ఏమో తర్వాత చిన్నగా నవ్వుతూ చెప్పింది. "మీరు పొరబడ్డట్టున్నారు. ఇంటర్వ్యూలు గత గురువారం జరిగాయి. ఈ రోజు మరలా గురువారం వచ్చేసింది. అంటే మీరు వారం లేటన్మాట. చాలా తమాషాగా ఉంది. ఇంటర్వ్యూలకి గంట లేట్ వచ్చేవాళ్ళని చూశాను... ఉదయం ఉంటే సాయంత్రానికి వచ్చిన వాళ్ళని చూశాను.

వారం లేట్‌గా రావడం ఓ రికార్డే" అంటూ మరోసారి నవ్వింది.

"సారీ, ఆల్రెడీ మిమ్మల్ని అప్పాయింట్ చేసుకున్నట్టున్నారు. ఖాళీ ఇంకా ఉందేమోనన్న ఆశతో వచ్చాను" నా సర్టిఫికెట్లున్న ఫోల్డర్‌ని చేతిలోకి తీసుకుంటూ అన్నాను.

వెనక్కి తిరిగి వెళ్ళబోతుంటే "వేకెన్సీ ఇంకా ఫిలప్ కాలేదు" అందామె. ఆగిపోయి "మరి మీరూ..." అన్నాను.

"నేను ఆర్నెల్ల నుంచి ఇక్కడ పని చేస్తున్నాను. ఈ మధ్యనే నాకు పెళ్ళి నిశ్చయమైంది. త్వరలో మా వారితో కలిసి బెంగుళూరు వెళ్ళిపోతాను. అందుకే రిసెప్షనిస్ట్ అవసరమై డాక్టర్ గారు యాడ్ ఇచ్చారు. ఎవర్నీ అపాయింట్ చేయలేదుగానీ ఇంటర్వ్యూలు మాత్రం ఐపోయాయి"

"మీరు డాక్టర్ గార్ని అడగండి. వారు ఉండమంటే ఉంటాను లేకపోతే వెళ్ళిపోతాను".

ఆ అమ్మాయి లోపలికెళ్ళొచ్చి చెప్పింది. "మీరు లక్కీ... పేషంట్స్ అందరూ వెళ్ళిపోయాక మిమ్మల్ని పంపమన్నారు. బీ సీటెడ్ సమ్ వేర్"

బతుకుజీవుడా అనుకుంటూ ఓ కుర్చీలో కూలబడ్డాను. అసలు అమ్మ అలాంటి పని ఎందుకు చేసిందో అర్థం కావటం లేదు. అమ్మేనా అలా చేసింది అన్పిస్తోంది. నా కళ్ళతో చూశాను కాబట్టి సరిపోయింది. ఇదే ఎవరైనా చెప్పి ఉంటే నమ్మకపోగా నాలుగు తగిలించి ఉండేదాన్ని.

గత గురువారం ఉదయం నేనూ శ్రీధర్ ఒకేసారి ఇంటి నుంచి బైటపడ్డాం. 'నువ్వు ఉద్యోగం చేయటం అవసరమంటావా? నా జీతం సరిపోదా?' అని ఏ పదో సారో అడిగాడు.

'నీ జీతం చాలదని కాదు. నా చదువుకి ఓ సార్థకత ఉండాలిగా. ఉద్యోగం ఈ రోజుల్లో పురుష లక్షణం కాదు. మనిషి లక్షణం' అన్నాను.

'సరే నీ ఇష్టం. ఆల్ ది బెస్ట్. నిన్ను డ్రాప్ చేయమంటావా?'

'వద్దు. అమ్మను చూసి వారం దాటింది. ఒకసారి అమ్మ దగ్గరకు వెళ్ళి

అట్నుంచి ఇంటర్వ్యూకు వెళ్తాను' అన్నాను.

నేను వెళ్ళేప్పటికి అమ్మ వంట గదిలో ఉంది. అన్నయ్య అమెరికా వెళ్ళి సెటిలైపోయాడు. నా పెళ్ళి చేశాక అమ్మ ఒంటరిగానే ఉంటోంది. శ్రీధర్ ఉద్యోగం హైద్రాబాద్‌లో కావటం గుడ్డిలో మెల్ల... వారానికి ఒకసారైనా అమ్మను చూసి, పల్కరించే అవకాశం ఉంది.

సర్టిఫికెట్లున్న ఫోల్డర్ డైనింగ్ టేబుల్ మీద పెట్టి 'ఏం వంట చేసుకుంటున్నావమ్మా' అంటూ వంట గదిలోకెళ్ళాను. ఇంటర్వ్యూకెళ్తున్న విషయం చెప్పాక కొద్దిసేపు పిచ్చాపాటి మాట్లాడుకున్నాం. బయల్దేరే ముందు బెడ్రూంలో ఉన్న అటాచ్డ్ బాత్రూంకెళ్ళి బైటికొచ్చి చూస్తే నా సర్టిఫికెట్ల ఫోల్డర్ లేదు.

'అమ్మా... నువ్వు తీశావా?' అని కంగారుగా అడిగా.

'నేనా... నేనెందుకు తీస్తాను?' అంది అమ్మ ఆశ్చర్యంగా.

'ఇక్కడే పెట్టానమ్మా... ఇంతలో ఎలా మాయమైపోతుంది?'

ఇద్దరం కలిసి ఇల్లంతా వెదికాం. దొరకలేదు. ఐనా డైనింగ్ టేబుల్ మీద పెట్టిన ఫైల్‌కి కాళ్ళు రావుగా మరెక్కడికో నడుచుకుంటూ పోవడానికి? ఎవరైనా తీసి ఉండాలి. ఎవరు తీసి ఉంటారు? దాని వల్ల వాళ్ళకు ఒనగూడే ప్రయోజనమేదీ కన్పించలేదు.

'అసలు ఇంటి నుంచి తెచ్చావో లేదో' అంది అమ్మ.

తీసుకురాకపోవడమేమిటి... నాన్సెన్స్. నాకంత మతిమరుపు లేదు. ఎందుకైనా మంచిదని శ్రీధర్‌కి ఫోన్ చేశాను.

'నీ చేతిలో ఫోల్డర్ ఉండింది స్వప్నా... బ్లూ కలర్ ఫోల్డర్ కదా. ఐ యాం ష్యూర్ ఎబౌటిట్... మరోసారి వెతుకు' అన్నాడు.

'పక్కింటి వాళ్ళు తీస్కెళ్ళి ఉండొచ్చు. ఈ మధ్య నా వస్తువులు కొన్నిటిని దొంగిలించారు తెలుసా' అంటున్న అమ్మ వైపు ఆశ్చర్యంగా చూశాను. మాకు చక్కటి సంస్కారాన్ని నేర్పిన అమ్మేనా ఇలా మాట్లాడుతోంది? పక్కింట్లో బ్యాంకు మేనేజర్ గారి కుటుంబం ఉంది. వాళ్ళకేం ఖర్మ పట్టిందని...

'ఛ. అవేం మాటలమ్మా. వాళ్ళకు తెలిస్తే గొడవలౌతాయి. మరోసారి అలా అనకు. ఐనా నా సర్టిఫికెట్లు దొంగిలిస్తే ఎవరికైనా ఏమొస్తుంది? కాలిస్తే బూడిద తప్ప'

నా అనుమానం శ్రీధర్ మీదకి మళ్ళింది. నేను ఉద్యోగం చేయటం ఇష్టం లేనిది అతనికే. అందుకే ఈ పని చేసి ఉంటాడా... చాలా అర్థరహితమైన అనుమానం... మేం కిచెన్‌లోనో, నేను బాత్రూంలోనో ఉండగా దొంగలా వచ్చి ఫైల్ పట్టుకెళ్ళి ఉండటం సాధ్యమేనా... మరీ సినిమాటిక్ ఊహ... ఇంతకీ నా ఫైల్ ఏమైనట్లు...

వెతికి వెతికి విసుగుపుట్టి వదిలేశా... ఆ కోపం శ్రీధర్ మీద పరావర్తనం చెంది... మూడు రోజులు శ్రీధర్‌తో మాట్లాడకుండా సతాయించా. 'నీ కళ్ళు చల్లబడ్డాయా... ఇపుడు ఏ ఇంటర్వ్యూలకు వెళ్ళలేనుగా... సంతోషమేనా' అంటూ విరుచుకుపడ్డా.

రెండు రోజుల్నుంచీ అమ్మ గంటకో ఫోన్ చేస్తోంది. 'స్వప్నా... నాకెందుకో దిగులు దిగులుగా ఉంది. రావా' అంటూ... చివరికి రాత్రి పదకొండింటికి కూడా చేసింది. అందుకే ఉదయం శ్రీధర్ ఆఫీస్‌కెళ్ళాక అమ్మ దగ్గరకెళ్ళా.

'ఏం లేదమ్మా... నిన్ను చూడాలనిపించీ' అంటూ పసిపిల్లలా నవ్విన అమ్మను దగ్గరకు తీసుకుని 'పిచ్చి అమ్మ' అన్నాను. ఇల్లంతా చిందర వందరగా ఉంది. బెడ్ మీద దుప్పటి మార్చి ఎన్ని రోజులైందో... మాసిపోయింది.

'అమ్మా నీట్‌నెస్ కోసం ఎంతైనా శ్రమ పడే నువ్వేనా... ఇల్లు చూడు ఎలా ఉందో... ఆరోగ్యం బాగోలేక చేసుకునే ఓపిక లేకపోతే పనిమనిషిని పెట్టుకోవచ్చుగా' అంటూనే బెడ్ సర్దడం ప్రారంభించాను.

'నాకెందుకూ పనిమనిషి... గుమ్మటంలా నేను లేనూ' అంది అమ్మ.

ఐక్కుపల్చగా ఉండే అమ్మ తన్ను తాను గుమ్మటంతో పోల్చుకున్నందుకు నవ్వుకుంటూ మంచం మీది పరుపు తీసి కింద వేశాను. పరుపు కింద నా బ్లూ కలర్ ఫోల్డర్...

నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. అమ్మ ఇలాంటి హేయమైన పని ఎలా చేయగలిగింది? అసలు ఎందుకు చేసింది? నేను ఉద్యోగం చేయటం ఇష్టం లేదా... దాని వల్ల అమ్మకేం నష్టం? ఆడపిల్లలు బాగా చదువుకుని పెద్ద పెద్ద ఉద్యోగాలు చేయాలని, ఎవరి మీదా ఆధారపడి ఉండకూడదనీ కదా మాకు నూరి పోసింది... మరి ఆ అమ్మేనా నేను ఇంటర్వ్యూకెళ్లకుండా సర్టిఫికెట్లని దాచిపెట్టింది?

పెద్దగా 'అమ్మా' అంటూ కేక పెట్టాను. ఎంత ఆపుకుందామన్నా కోపం ఆగటం లేదు.

అమ్మ కంగారు పడ్తూ వచ్చింది. కోపంతో రగిలిపోతున్న నన్నూ, కింద పడి ఉన్న పరుపునీ - మంచం మీదున్న ఫోల్డర్‌నీ మార్చి మార్చి చూసింది. ఎటొచ్చీ ఆమె మొహంలో దొరికిపోయానన్న అపరాధ భావం లేశమాత్రం కూడా కన్పించలేదు.

'ఈ ఫైల్ నీ పరుపుకిందికి ఎలా వచ్చింది? దీని గురించేగా పోయిన గురువారం యిల్లంతా వెదికాం...'

అమ్మ నా వైపు శూన్యంగా చూసింది. మరలా బ్లూకలర్ ఫైల్ వైపు చూసింది.

'ఇదిక్కడికి ఎలా వచ్చిందో నాకు తెలీదు. ఈ ఫైల్‌ని ఇప్పుడే చూస్తున్నాను' అంది. ఆమె మొహం నిండా ఆశ్చర్యం...

చేసిన తప్పుని ఎలా కప్పి పుచ్చుకుంటుందో... తప్పుని ఒప్పుకోవటంలో గొప్పతనం ఉందని మాకు చెప్పిన నీతులన్నీ ఏమైనాయో? ఆశ్చర్యాన్ని ఎంత బాగా నటిస్తుందో...

'అమ్మా! ఎందుకు అబద్ధాలు చెప్తావు? నువ్వే కదా తీసి దాచిపెట్టావు... ఎందుకలా చేశావు? నిజం చెప్పు... నేను ఉద్యోగం చేయటం నీకిష్టం లేదా... ఆ విషయం నాతో చర్చించి ఉండొచ్చుగా... సర్టిఫికెట్లున్న ఫైల్‌ని ఇంటర్వ్యూ రోజు దాచేయటం ఏమిటి? దాన్ని దొంగతనం అంటారు తెలుసా' అరిచినట్లే మాట్లాడాను.

అమ్మ కళ్ళనిండా దిగులు...

'నిజం. నాకేమీ తెలీదు. ఈ ఫైల్ నేనింతకు ముందెప్పుడూ చూళ్ళేదు'

'నీకు తెలీకుండానే నీ మంచం మీదికి చేరిందా... దెయ్యాలో భూతాలో చేశాయా' అన్నాను కోపంగా.

'ఏమో' అంది అమ్మ.

'ఛీ... సిగ్గుగా లేదా తప్పు చేసి బుకాయించడానికి? ఓ తల్లి చేయాల్సిన పనేనా ఇది'

'నాకు తెలీదంటే వినవేంటి' అమ్మ కూడా విసురుగా అంది.

అంతే... విపరీతమైన కోపంలో అమ్మను భుజాల దగ్గర బలంగా పట్టుకుని ఆవేశంతో వూపేస్తూ 'అమ్మా! అబద్ధాలు చెప్పింది చాలు' అంటూ వదిలేశాను. అమ్మ విసిరేసినట్లుగా వెళ్ళి మంచం మీద పడిపోయింది.

అమ్మ కళ్ళలో భయం... నా వైపు పరాయి వ్యక్తిని చూసినట్లు చూసింది... నేనెవరో గుర్తు పట్లనట్లు... నన్ను మొదటిసారి చూస్తున్నట్లు...

అపరాధభావం కొండ చిలువలా చుట్టేస్తూ... చప్పున అమ్మను కౌగిలించుకుని 'సారీ అమ్మా' అన్నాను.

అదే చూపు... చాలా దూరం జరిగిపోయినట్లు... ఒకరికొకరం అపరిచితుల్లా... అక్కడి నుంచి వేగంగా పారిపోవాలనిపించేలా... ఫైల్ తీసుకుని ఇంటికొచ్చి, మంచం మీద పడుకుని గంట సేపు ఏడ్చాను.

నాకు గుర్తుండి అమ్మ ఎప్పుడూ నన్ను కొట్టలేదు. కోపంగా తిట్టి ఎరుగదు. అమ్మ ప్రేమలో, పెంపకంలో, మాటలో మాధుర్యం తప్ప మేమెప్పుడూ కటుత్వం చూళ్ళేదు.

ఒకసారి అన్న మీద కోపం వచ్చి కొట్టాను. నాకు ఐదేళ్ళుంటాయప్పుడు. వాడు తిరిగికొట్టాడు. నేను ఏడుస్తుంటే అమ్మ వచ్చి ఎత్తుకుంది. 'చూడమ్మా... నేను పెద్దవాణ్ణి కదా నన్ను కొట్టొచ్చా' అని అన్నయ్య అంటే వాణ్ణి సముదాయిస్తూ 'అది చిన్న పిల్ల నాన్నా... మెల్లగా చెప్పాలి తప్ప దాన్ని తిరిగి కొడ్తే ఎలా? నువ్వే చెప్పావుగా పెద్దవాడివని. పిల్లలు తప్పు చేస్తే పెద్ద వాళ్ళు మృదువుగా చెప్పాలి. సరేనా' అంది. నేను ఏడుపు మానలేదు. అప్పటికప్పుడు సుల్తాన్ బజార్ వెళ్ళి

చిన్న టెడ్డీబేర్ కొని తెచ్చింది.

'చూశావా నీకో బుల్లి ఫ్రెండ్‌ని తెచ్చాను. ఎంచక్కా దీంతో ఆడుకోవచ్చు... కబుర్లు చెప్పుకోవచ్చు... జోకొట్టి నీ పక్కనే పడుకోబెట్టుకోవచ్చు' అంది నా చేతికిస్తూ.

అన్న కొట్టిన దెబ్బల్ని మర్చిపోయి టెడ్డీబేర్‌తో హాల్లో ఆడుకుంటున్న నన్ను వంట గది తలుపు దగ్గర నిలబడి అమ్మ మురిపెంగా చూడటం నేనెన్నటికీ మర్చిపోలేను. ఈ టెడ్డీబేర్‌ని నేనెప్పుడూ దూరం చేసుకోలేదు. కాలేజీ చదువులకొచ్చినా దాన్ని అపురూపంగా దాచిపెట్టుకున్నా. పెళ్ళయ్యాక నా వస్తువుల్తో పాటు దాన్నీ తీసుకెళ్ళా. 'ఇంకా చిన్న పిల్లవా' అని ఆట పట్టించిన శ్రీధర్‌తో 'నా చిన్ననాటి తీపి జ్ఞాపకం. మన వయసు పెరిగే కొద్దీ ఆ అనుభూతిలోని గాఢత, తీయదనం మరింత పెరుగుతాయి తెలుసా' అన్నాను.

అలాంటి అమ్మను కోప్పడినందుకు, మంచం మీదికి పడేలా వూపేసినందుకు చాలా బాధగా ఉంది. నన్ను నేను ఎప్పటికీ క్షమించుకోలేని తప్పు...

డాక్టరుగారు పిలుస్తున్నారని రిసెప్షనిష్ట్ చెప్తే ఆలోచనల్లోంచి బైట పడి డాక్టర్ గారి ఛాంబర్‌లోకి వెళ్ళాను. వారు నా సర్టిఫికెట్లు చూశాక గతవారం రాక పోవడానికి కారణం చెప్పాను.

"మీ అమ్మ గారికి మీరు ఉద్యోగం చేయటం ఇష్టం లేదనిపిస్తోంది. దానిక్కారణం మీ మీది ప్రేమ కావచ్చు. అటు సంసారం, ఇటు ఉద్యోగం నిభాయించుకోవటంలో తన కూతురు ఎక్కడ శ్రమపడిపోతుందోననే ఆరాటం కావచ్చు" అన్నారాయన.

"మొన్న ఇంటర్వ్యూకొచ్చిన వారిలో కొంతమందికి సరైన క్వాలిఫికేషన్ లేదు. మిగతా వారికి కమ్యూనికేషన్ స్కిల్స్ లేవు. మరోసారి యాడ్ ఇద్దామనుకున్నా. మీరు వచ్చారుగా. రేపటినుంచి జాబ్‌లో జాయినైపొండి" అన్నారు.

ఉద్యోగం వచ్చిందన్న సంతోషం కంటే అమ్మ విషయంలో అమానుషంగా ప్రవర్తించానన్న బాధే ఎక్కువగా ఉంది.

సాయంత్రం భయపడ్తూనే అమ్మ దగ్గరకెళ్ళాను. కోపంగా ఉంటుందేమో...

మాట్లాడదేమో... అలిగిందేమో... అభిమాన పడిందేమో...

అసలేమీ జరగనట్లే అమ్మ మాట్లాడితే ఆశ్చర్యమేసింది. అమ్మ కాబట్టి క్షమించిందా... గుర్తు లేదా... గుర్తు పెట్టుకోదల్చుకోలేదా... పసిపిల్లలా ఆ విషయాన్ని ఆ క్షణమే వదిలేసిందా... పసిపిల్ల తెలీక చేసిందనుకుందా... అమ్మ ఎంత గొప్పది!

వారం తర్వాత క్లినిక్‌కి వెళ్ళేముందు అమ్మను చూడ్డానికి వెళ్ళాను.

అమ్మ అసహనంగా ఇల్లంతా తిరుగుతూ ఉంది. నన్ను చూడగానే సంతోషంగా ఎదురొచ్చి "వచ్చావా... నీ కోసమే ఎదురుచూస్తున్నా. ఇంతాలస్యమైందేం" అంది. నేనొస్తున్నట్లు అమ్మకు చెప్పలేదే... ఆలస్యమేమిటి? అర్థం కానట్లు అమ్మ వైపు చూసాను. ఆమె కళ్ళలో ఏదో బెదురు...

"నా దగ్గరే కూచో... నా పక్కనే... ఇక్కడే" అంది నన్ను కూచోబెట్టి తనూ కూచుంటూ.

"అదెలా కుదుర్తుందమ్మా. నేను పనికెళ్ళాలిగా"

"వద్దు. ఎక్కడికీ వెళ్ళొద్దు. నన్నొదిలి వెళ్ళొద్దు" అమ్మ ముడుచుకుపోతూ అంది.

"నాకింకో అర్ధగంట టైం ఉంది. అప్పటి వరకూ నీకు కంపెనీ ఇస్తాలే. ఇంతకూ స్నానం చేయలేదా?"

"లేదు"

"అదేమిటమ్మా ఎప్పుడూ ఆరింటికి ముందే స్నానం చేస్తావుగా. సరే. బాత్రూంలో నీళ్ళు పెడ్తాను. స్నానంచేయి. నీ స్నానం అయ్యాక నేను వెళ్తాను"

"వద్దు. నువ్వు వెళ్ళొద్దు"

పసిపిల్లలా మారాం చేస్తున్న అమ్మను చూస్తే నవ్వొచ్చింది. "సరే... వెళ్ళను. మొదట స్నానం చేసిరా" అన్నాను బాత్రూంలో వేడి నీళ్ళు పెట్టొచ్చి...

అమ్మ బాత్రూంలోకెళ్ళింది. గడియపెట్టుకుంది. రెణ్నిముషాలు కాకముందే "తలుపు తీయండి" అని విన్పించింది. అది అమ్మ గొంతు.

"అమ్మా... ఏమైంది? గడియ తీయి" నేను లేచి బాత్రూం తలుపు దగ్గరకెళ్ళి

నిలబడ్డాను.

నా మాటలు విననట్లే అమ్మ తలుపు మీద గట్టిగా శబ్దం చేస్తూ "తలుపు తెరవండి. ఎంత లాగినా రావట్లేదు" అంది.

"అమ్మా, తలుపు లాగటం ఏమిటే... బోల్టేసుకుంది నువ్వేగా... అది తీయి తలుపు వస్తుంది" పెద్దగా అరుస్తూ చెప్పాను.

"తలుపు తెరవండి... తలుపు తెరవండి" అమ్మ తలుపు మీద దబదబా బాదుతూ చెప్పింది.

నాకో క్షణం ఏమీ పాలుపోలేదు. అమ్మకు భయం వల్ల అగమ్యగోచరంగా ఉందేమోననిపిస్తోంది. లోపల పామేమైనా ఉందా... చూడకూడనిదేమైనా చూసి కంగారు పడిందా... పక్కింటి వాళ్ళని పిలుద్దామనుకొని ఆగిపోయాను. అమ్మ స్నానానికని వెళ్ళింది. ఏ స్థితిలో ఉందో... భయంలో బట్టలు చుట్టుకోవటం మరిచిపోతేనో...

బాత్రూం తలుపులు పదిహేనేళ్ళ పాతవి. గడియలు అప్పుడు పెట్టించినవే. తుప్పు పట్టి ఉన్నాయి. కొద్దిగా బలం ఉపయోగిస్తే చాలు. తలుపుల్ని కొద్ది కొద్దిగా నెడ్తూ బలంగా తోపు తోశాను. తలుపులు తెరుచుకున్నాయి. అమ్మ లోపలికెలా వెళ్ళిందో అలానే నిలబడి ఉంది.

"అమ్మా ఏమైంది?" బాత్రూం చుట్టూ కలయచూస్తూ అడిగాను.

"ఏమోనమ్మా. లోపలికి ఎందుకు వెళ్ళానో గుర్తు రాలేదు. బైటి కొద్దామంటే తలుపు రాలేదు" అంది అమ్మ.

మొట్టమొదటిసారి అమ్మ వైపు భయంగా చూశాను. ఈవిడ ఆరోగ్యంగానే ఉందా... మానసికంగా మామూలుగానే ఉందా...

క్లినిక్‌కి వెళ్ళటం అరగంట ఆలస్యమైంది. పేషంట్స్ అందరూ వెళ్ళాక ఉదయం జరిగిన విషయం డాక్టర్ రావు గారికి చెప్పాను.

"మీ అమ్మగారి వయసునీ, జరుగుతున్న సంఘటనల్నీ పట్టి చూస్తే 'అల్జీమీర్స్ వ్యాధి' అనిపిస్తోంది. రేపోసారి పిల్చుకురండి టెస్ట్ చేద్దాం" అన్నారు.

అన్ని పరీక్షల తర్వాత అమ్మకు అల్జీమీర్స్ వ్యాధి అని నిర్ధారించారు.

అరవై ఐదేళ్లు పైబడిన వారికి ఈ జబ్బు వస్తుందని, ప్రపంచవ్యాప్తంగా మూడు కోట్ల మంది ఈ వ్యాధితో బాధ పడుతున్నారనీ డాక్టర్ రావుగారు చెప్పారు.

"మీ అమ్మగార్ని కంటికి రెప్పలా కాపాడుకోవాలి. మతిమరుపు మరింత పెరిగే అవకాశం ఉంది. బైటికి ఒంటరిగా వెళ్ళనివ్వొద్దు. యిల్లు మర్చిపోవచ్చు. మందులు రాసిస్తాను. ఉపశమనానికే తప్ప ఈ జబ్బుని నయం చేసే మందులు లేవు. ఎటొచ్చీ చాలా సహనం, ఓపిక, గుండె నిండా ప్రేమ ఉండాలమ్మా ఇలాంటి రోగుల్ని భరించాలంటే" అన్నారాయన.

ఎంత ఆపుకుందామన్నా నాకు కన్నీళ్ళు ఆగటం లేదు. "ప్రాణానికేమీ ప్రమాదం ఉండదుగా డాక్టర్" అడగలేక అడగలేక అడిగాను.

"మరో నాలుగైదేళ్ళు బతకొచ్చు... అంతేనమ్మా" మందుల చీటీ చేతికిస్తూ అన్నారు.

అమ్మను అదే రోజు మా యింటికి పిల్చుకెళ్ళి పోయాను. శ్రీధర్‌కి విషయమంతా చెప్పాను. అమ్మను చూసుకోవడానికి ఓ పని మనిషిని ఏర్పాటు చేశాను.

ఉదయం అమ్మకు స్నానం చేయించాక, టిఫిన్ తినిపించి క్లినిక్‌కి వెళ్ళే ముందు పని మనిషికి వంద జాగ్రత్తలు చెప్పి వెళ్ళటం... సాయంత్రం తిరిగొచ్చి అమ్మను చూసే వరకు అమ్మ ఎలా ఉందో ఏం చేస్తుందోనన్న ఆందోళనకు లోనుకావడం...

వారం రోజులు సజావుగానే గడిచాయి. ఆ రోజు ఇంటి సమీపానికి రాగానే ఇంటి నుంచి పెద్ద పెద్ద కేకలు విన్పిస్తున్నాయి. అది అమ్మ గొంతే. అమ్మ ఇంత పెద్దగా అరవటం ఇదే మొదటిసారి. తిట్ల వర్షం... వినకూడని తిట్లూ శాపనార్థాలూ...

పరుగులాంటి నడకతో యింట్లోకి ప్రవేశించాను. గడప దగ్గర పనిమనిషి బిక్కు బిక్కుమంటూ కూచొని ఉంది. గది తలుపులు బైట నుంచి వేసి ఉన్నాయి. "తలుపు తీయవే... నేను మా యింటికెళ్ళాలి. తలుపు తొందరగా తీ" తలుపు

పగిలేలా బాదుతోంది అమ్మ.

"ఏమైంది?" అని అడిగా పనిమనిషిని.

"బట్టలు సూట్‌కేస్లో సర్దుకుని బైటికెళ్ళిపోతున్నారమ్మా. ఎన్నిమార్లు ఆపినా ఆగటంలా. గట్టిగా పట్టుకుని ఆపితే విదిలించి కొట్టారమ్మా" అంది.

తలుపు తీశాను. అమ్మ సూట్‌కేస్‌తో బైటికొచ్చింది.

నన్ను పరాయి వ్యక్తిని చూసినట్లు చూసింది. శూన్యమైన చూపు...

"ఎక్కడికమ్మా" ఆమెను ఆపే ప్రయత్నం చేయకుండా ఆమెతోపాటు నడుస్తూ అడిగా.

"ఎవర్నువ్వు" అంది ఆగి నావైపు సాలోచనగా చూస్తూ. గుర్తుకు తెచ్చుకోడానికి విఫలయత్నం చేస్తున్నదేమో... నుదుటి మీద చెమట బిందువులు పొటమరించాయి.

ఓ తల్లి తన కన్నకూతుర్ని పట్టుకుని ఎవర్నువ్వు అని అడిగే పరిస్థితి రావడం కన్నా దౌర్భాగ్యం ఏం ఉంటుంది?

"నేను నీ కూతుర్నమ్మా" అన్నాను.

నమ్మకం లేనిదానిలా చూసింది. "నేను మా యింటి కెళ్తున్నా"

"యిది కూడా నీ యిల్లేనమ్మా"

"కాదు. ఇది నా యిల్లు కాదు. వేరే వాళ్ళ యిల్లు. నేను నా యింటికే వెళ్తాను"

అమ్మతోపాటు నడుస్తూనే సెల్లోంచి డాక్టర్ గారికి ఫోన్ చేశాను. "ఆమె ఏది తన యిల్లనుకుంటే దాన్లోనే ఉండగలుగుతుంది. మరోచోట ఆమెని ఉండమని కట్టడి చేయలేం" అన్నారు.

అమ్మకు ఆటో ఎక్కాలన్న ధ్యాసే లేదు. కొద్ది దూరం నడిచి పక్క సందులోకి తిరిగి ఎటుకో వెళ్ళిపోతోంది. "మన యిల్లు యిటు కాదమ్మా" అన్నా విన్పించుకోవటం లేదు.

ఆటోని పిల్చి ఎలాగోలా అమ్మని తన యింటికి పిల్చుకెళ్ళాను.

కొన్నాళ్ళు అమ్మ దగ్గరే ఉంటానని శ్రీధర్‌తో చెప్పాను. పది రోజులు పోయాక ఉదయం శ్రీధర్ వచ్చి బాగా గొడవ పడ్డాడు.

"నీకు మీ అమ్మ తప్ప భర్త ధ్యాస లేదా? నాకూ కొన్ని అవసరాలుంటాయని మర్చిపోయావా? అలాంటప్పుడు పెళ్ళెందుకు చేసుకున్నావు?" అంటూ పరుషంగా మాట్లాడాడు.

"శ్రీధర్. వై డోంట్ యూ అండర్‌స్టాండ్? అమ్మ పరిస్థితి తెల్సుగా. నేను తప్ప అమ్మకెవరున్నారు చెప్పు.. ప్లీజ్ శ్రీధర్. మరి కొన్నాళ్ళు..."

"ఎన్నాళ్ళు? ఇది రోజుల్లోనో నెలల్లోనో తేలే వ్యవహారం కాదని నీకు తెలుసు" అన్నాడు కోపంగా.

"అందుకేగా చెప్పాను. నువ్వూ వచ్చి యిక్కడే మాతో పాటు ఉండు"

"నేను రాను. నాకంత ఖర్మ పట్టలేదు. మీ అమ్మతో పాటే ఉంటావో లేక వచ్చేసి నాతో కాపురం చేస్తావో నువ్వే తేల్చుకో" అనేసి కోపంగా వెళ్ళిపోయాడు.

మనసంతా వికలమైపోయింది. తలభారం... క్లినిక్‌లో పని చేయలేకపోయాను. తలనొప్పిగా ఉందని చెప్పి పర్మిషన్ తీసుకుని మధ్యాహ్నమే యింటి కొచ్చేసాను. మనసంతా అలజడి... దిగులు... నా సంసారం ఏం కాబోతోంది? అలాగని అమ్మని ఎలా వదిలి వెళ్ళగలను? ఈ మగవాళ్ళు ఎందుకిలా ప్రవరిస్తారు... ఆ మాత్రం అర్థం చేసుకోలేరా... సర్దుకుపోలేరా?

హాల్లో సోఫాలో పడుకున్నా... అనంతమైన ఆలోచనల శకలాలు ఉల్కల్లా రాలిపడుత్తూ... డైనింగ్ టేబిల్ సర్దుతున్న శబ్దం... కుర్చీలు అటూ ఇటూ జరుపుతున్న శబ్దం... తలెత్తి చూశాను. అమ్మ... నేను తన వైపు చూడగానే "టైం ఎంతయిందీ" అని అడిగింది.

నా చిన్నప్పుడు గడియారంలో టైం ఎలా చూడాలో నాకు నేర్పిన అమ్మ... ఎదురుగా గడియారం పెట్టుకుని టైం ఎంతయిందని అడుగుతోంది.

గడియారం వైపు చూసి "మూడుంపావు" అని చెప్పాను.

రెణ్ణిమిషాలైనా కాకముందే మరలా అడిగింది "టైమెంత?" అని. చెప్పాను.

మరలా కుర్చీలు సర్దింది. డైనింగ్ టేబుల్ జరిపింది. "టైమెంతయింది" అని అడిగింది. మూడు ఇరవై అని చెప్పాను. ఓ ఐదు నిముషాలు డైనింగ్ టేబుల్

దగ్గరే కూచుని, లేచి హడావిడిగా కుర్చీలు జరిపింది. డైనింగ్ టేబుల్ అంతా శుభ్రంగా తుడిచింది. "టైమెంతయింది" అని అడిగింది. శ్రీధర్ మాట్లాడిన కటువైన మాటలు మననం చేసుకుంటున్న నాకు అమ్మ పదే పదే టైం గురించి ఆడగటంతో చిర్రెత్తుకొచ్చింది.

"టైమా... ఎంత కావాలి నీకు? అసలు నీకు టైంతో ఏం పని? తలనొప్పితో ఓ వైపు ఛస్తుంటే ఆ శబ్దాలేమిటి? డైనింగ్ టేబుల్ కుర్చీలు ఎందుకలా జరుపుతావు? ఎవర్నని ఏం లాభం? నా తలరాత బాగోలేదు. నా టైం బాగోలేదు" అంటూ పెద్దగా కేకలేశాను.

అమ్మ గమ్మునైపోయింది. హాల్లో ఓ మూలకెళ్ళి ముడుచుకుని కూచుంది. ఆమె కళ్ళలో బెదురు స్పష్టంగా కన్పిస్తోంది.

చప్పున జాలేసింది నాకు. తనేం చేస్తుందో తనకే తెలీని స్థితి అమ్మది. లేచి అమ్మ దగ్గరకెళ్ళా. భయంతో మరింత ముడుచుకుపోయింది. తనని తినేయడానికొస్తున్న క్రూర జంతువు వైపు మేకపిల్ల చూసే చూపులా... కళ్ళల్లో భయం నగ్నంగా నర్తిస్తోంది.

డాక్టర్ గారికి ఫోన్ చేశాను.

"గతంలో గెస్టలని పిలిచి అతిథ్యం ఇవ్వటం ఆమె మెదడుకి ఇప్పుడు గుర్తొచ్చి ఉంటుంది. అందుకే డైనింగ్ టేబిల్ సర్ది మిమ్మల్ని టైం అడిగింది. ఎటొచ్చీ తను టైం అడిగిన విషయం, మీరు సమాధానం చెప్పిన విషయం మరుక్షణమే మర్చిపోవటం వల్ల పదే పదే అదే ప్రశ్నని అడగటం జరుగుతుంది. మీకు చెప్పాగా, అటువంటి పేషంట్లని చూసుకోవాలంటే చాలా సహనం ఉండాలని" అన్నారు.

"దీనికేమైనా సొల్యూషన్ ఉందా" అని అడిగా.

"ఏదైనా ఆట వస్తువు తెచ్చివ్వండి. ఆ ధ్యాసలో పడి అట్టే ప్రశ్నలతో విసిగించరు" అన్నారు.

నా చిన్నప్పుడు అమ్మ నాకు కొనిచ్చిన టెడ్డీబేర్ గుర్తొచ్చింది. అది నా అల్మైరాలో భద్రంగా ఉంది. దానికోసమని యింటికెళ్ళాను. నా యిల్లు నాకే కొత్తగా, పరాయిదిగా

అన్పించింది. టెడ్డీబేర్ తీసుకుని వచ్చేముందు చిన్న కాగితం మీద "శ్రీధర్! నువ్వంటే నాకు ప్రేమ... అమ్మన్నా కూడా. నాకు ఇద్దరూ కావాలి. నన్నర్థం చేసుకో ప్లీజ్" అని రాసి డైనింగ్ టేబిల్ మీద పెట్టి వచ్చాను.

అమ్మకు టెడ్డీబేర్ ఇస్తే చిన్నపిల్లలా సంబరపడుతూ తీసుకుంది.

వంటగదిలో భోజనం తయారుచేసే పనిలో నిమగ్నమై, అమ్మ గుర్తొచ్చి తలుపు దగ్గర నిలబడి చూశాను. హాల్లో కూచుని టెడ్డీబేర్‌తో ఆడుకుంటోంది. ఒళ్ళో పాపాయిలా పడుకోబెట్టుకుని కబుర్లు చెబుతోంది. నాకు వెంటనే చిన్నప్పుడు అమ్మ టెడ్డీబేర్ కొని తెచ్చిన రోజు గుర్తొచ్చింది. ఇప్పుడు నేను నిలబడిన చోటే అమ్మ నిలబడి టెడ్డీబేర్‌తో ఆడుకుంటున్న నా వైపు మురిపెంగా చూసింది. అప్పుడు నేను కూచున్న చోటే అమ్మ కూర్చుని ఇప్పుడు టెడ్డీబేర్‌తో కబుర్లు చెప్తోంది.

అమ్మ చివ్వున తలెత్తి చూసింది. అదే చూపు... శూన్యాన్ని నింపుకుని... అపరిచితురాల్ని చూసినట్లు...

"ఎవర్నువ్వు? మా యింట్లో ఏం చేస్తున్నావు?" అని అడిగింది.

"నేను మీ అమ్మని" తడి కళ్ళతో సమాధానం చెప్పాను.

**(నవ్య దీపావళి ప్రత్యేక సంచిక 2007)**

★ ★ ★

కథా నిలయం
శ్రీకాకుళం